# రవళి

"రవళీ!...."

పరధ్యానంగా ఉన్న రవళి ఉలికి పడింది.

"ఏమిటి రమేష్ – నన్నింతసేపు వెయిటింగులో పెట్టడం ఏమన్నా బాగుందా– చూడు చీకటి పడిపోతోంది. నేనింటికి ఎప్పుడు వెళ్ళాలింకా!" అంతసేపు నిరీక్షించిన విసుగూ, రమేష్‌ను చూసిన ఆనందం– రెండూ మేళవించినై ఆమె మాటల్లో.

ఆ అలకకూడా మనోహరంగా ఉంది రమేష్‌కి. అలిగిన రవళిని మరింత ఉడికించి ఆనందించడం రమేష్‌కి చాలా ఇష్టం.

కానీ ఆరోజు రమేష్ మొహం వాడిపోయి ఉంది దిగులుగా కనిపిస్తున్నాడు. ఇంకెప్పుడైతే "నిరీక్షణలోనే ఆనందముందోయ్" అనో, మరోమాట అనో వాతావరణం ఉల్లాసపరచే వాడు.

"సారీ రవళీ! నువ్వు ఎదురు చూస్తుంటావని తెలుసు. అందుకే తప్పనిసరిగా ఇప్పుడయినా వచ్చాను. మా అమ్మని హాస్పిటల్‌లో చేర్పించాం." నుదుటికి పట్టిన చెమట తుడుచుకుంటూ చెప్పాడు రమేష్.

"సారీ రమేష్!– ఏమిటీ మీ అమ్మగారి సుస్తీ...."ఆందోళనగా అడిగింది రవళి.

కొంచెం సిగ్గుపడ్డాడు రమేష్........ ఆశ్చర్యపోయింది రవళి. కుటుంబ విషయాలెప్పుడూ రమేష్ ఆమెతో చెప్పలేదు. రవళి రెట్టించి అడిగితే అప్పుడు చెప్పాడు రమేష్. "అమ్మకి డెలివరీ టైమ్, తను చాలా వీక్గా ఉంది. ఇవాళ పొద్దుటినుంచి ఒంట్లో బాగాలేకపోతే ఆసుపత్రికి తీసుకువెళ్ళాను."

"మీ అమ్మ ఇప్పుడు ప్రెగ్నెంటా! ఈ వయసులో ఇది.... ఎన్నవది?" తెల్లబోతూ అడిగింది రవళి.

రమేశ్కి ఆ విషయం గురించి మాట్లాడాలంటే చాలా సిగ్గుగా ఉంది. "పదవ కాన్పు. ఏంచెయ్యను రవళీ, ఆపరేషన్ చేయించు కోమంటే దేవుడిచ్చిన పిల్లల్ని వద్దని కూడదంటుంది. నాన్నదీ అదే చాదస్తం."

రవళికి చాలా ఆశ్చర్యంగా ఉంది. కాలం మారి పోతున్నా ఇంకా ఇలాంటి మనుషులు మిగిలి ఉన్నారంటే నమ్మలేక పోతున్నది

"ఏమిటట్లా చూస్తున్నావ్! నా మీద అలక తీరలేదా అమ్మాయి గారికి" రమేశ్లో సహజంగా ఉండే ఉత్సాహం రవళి సమక్షంలో మళ్ళీపుంజుకుంది.

"అహాఁ అలగడానికి సమయం సందర్భం లేదా? ఇప్పుడావిడ కెట్లాఉంది?"

ఈ రాత్రికి డెలివరీ అవుతుందని చెప్పింది డాక్టరు.

"ఐతే ఇల్లుగడవడానికి, అంటే- మీ పిల్లలు తొమ్మిది మందీ, మీ అమ్మ, నాన్న- అందరికీ మీ సంపాదనే ఆధారమా?" రవళి కుతూహలంగా అడిగింది.

"అవును రవ్వ ఇంటి అద్దెలేదు- స్వంత ఇల్లే అనుకో. వచ్చిన చిక్కేమిటంటే అదేం చిత్రమోగానీ సంసారమంటే అమ్మకీ, నాన్నకీ కూడ పట్టలేదు. ఆఫీసునుంచి వచ్చాక ఆయన దదో లోకం. చదరంగమో, పేకాటో ఆడుతుంటారు. మిన్ను విరిగి మీదపడ్డా లెక్క లేదాయనకు. అమ్మ కెప్పుడూ అనారోగ్యం-ఎట్లాగో వంట అయిందని పించి మంచమెక్కుతుంది.- అదీగాక ఎప్పుడూ ఇంట్లో చంటిపిల్లలూ, మందులూ, మాకులూ. నాకు ఒక అక్క ఉంది.— దానికీ ఇప్పుడు డెలివరీటైమ్ - పెళ్లై ఖదేళ్ళు కాలేదు-ఇది మూడవ కాన్పు. ముందు ఇద్దరూ అమ్మాయిలే. ఈ సారి అబ్బాయి పుడ్తే ఆపరేషన్ చేయించు కుంటుందట".

"లేకపోతే?"

"ఇంకోఛాన్స్" ఇక నా నలుగురు తమ్ముళ్ళు ముగ్గురు చెల్లెళ్ళు- ఇంట్లో పట్టించుకునేవాళ్ళు లేక ఎవరెప్పుడొస్తారో. ఎప్పుడు వెళ్తారో తెలియకుండా సత్రంలాగా ఉంటుంది. నా తరువాతది చెల్లెలు పద్మజ- రెండో చెల్లెలు వనజ దాదాపు ఇద్దరికీ సినిమాలపిచ్చి- ఇంట్లో అమ్మకి సాయం చేద్దామన్న ధ్యాసకూడ ఉండదు. ఇక మగపిల్లలు సరేసరి కేరాఫ్ రోడ్స్...."

"రమేష్ మనం మాటల్లో పడిపోయాం. మీఅమ్మ హాస్పిటల్లో ఎట్లాఉన్నారో తెలియదు కదా- వెళ్దాం పదండి........ముందు మీ ఇంటికి వెళ్ళి...."

"నువ్వు మాఇంటికి వస్తావా?" ఆశ్చర్యంగా అన్నాడు రమేష్.

"అదేమిటి, నేను రాకూడదా?" కాస్త బాధగా అంది రవళి.

"అహా! రాకూడదనికాదు రవళీ! నిన్ను శ్రమ పెట్టడం నాకిష్టం లేదు. అసలు మా ఇంటి పరిస్థితి చూస్తే, మన పెళ్ళిపేరు చెబితేనే పారిపోతావేమో...."

"నన్నర్థం చేసుకున్నదింతేనా రమేష్. నిన్ను పెళ్ళిచేసుకుంటే ఆ ఇల్లు నా ఇల్లుకాదా? పద వెళ్దాం"- ఆమె పట్టు వదల్లేదు. రమేష్ కదలక తప్పలేదు.

ఇంట్లోకి అడుగు పెడ్తూనే కనిపించిన దృశ్యం- కుర్చీలో కూర్చుని ఇంటాయన అదే రమేష్ తండ్రి సిగరెట్టు తాగుతూ పావులు జరుపుతున్నాడు ఒక్కడే. ఆ గదంతా సిగరెట్టునుసి, పేకముక్కలు చిందర వందరగా పడిఉన్నై. "ఈమె నా ఫ్రెండ్ రవళి" అని పరిచయం చేశాడామెను తండ్రికి. ఆయన నిరాసక్తంగా నమస్కార మందుకుని మళ్ళా తనపనిలో లీనమైనాడు.

రవళి రమేష్‌తో లోపలికి నడిచింది. ఒకావిడ మంచంమీద పడుకునుంది మూలుగుతూ. వాళ్ళక్క అని ఊహించింది రవళి.

బయటెక్కడో ఆడుకుంటున్న మగపిల్లలు పరిగెత్తుకొచ్చారు. "అన్నయ్యా" అంటూ— వాళ్ళతల రేగిఉంది— తైల సంస్కారం లేదు.

"ఆకలి"— అంటూ చిన్నచెల్లెలు వనజతో సహా అందరూ ఏడుపు మొహం పెట్టారు.

"సరే ఇప్పటికైతే బ్రెడ్ తీసుకురా. తరువాత అన్నం క్యారేజి తెస్తాను. ఇవిగో డబ్బులు" అంటూ తమ్ముడు రవికి డబ్బులిచ్చాడు రమేష్.

రవళిని అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు. వనజ రమేష్‌ని రహస్యంగా అడిగింది "వదిననా అన్నయ్యా" అని.

"అవునుగానీ వెళ్ళి వదినకు పంచదారడబ్బా ఎక్కడుందో వెతికియ్యి" అన్నాడు. ఏకళనుందో డబ్బాలు వెతుకుతున్న రవళికి పంచదారడబ్బా అందించింది. మొత్తానికి కాఫీ తయారైంది.

"రవళీ! నీకిప్పటికే ఆలస్యమైంది. నువ్వింటికి వెళ్ళిపో. అక్కన్ను నేను హాస్పిటల్‌కు తీసుకు వెళ్తాను." అన్నాడు రమేష్.

"నేనూ హాస్పిటల్‌కు వస్తాను— దార్లో మా ఇంట్లో చెప్తానులే"— ఆ కుటుంబం తనదిగా, ఆత్మీయతాభావం నెలకొంటున్నా— తల్లికీ, తండ్రికీ పట్టని ఆ సంసారమంటే కోపంగాకూడా ఉంది రవళికి. ఇష్టం వచ్చినట్లు పిల్లల్ని కనడమే హక్కుగా బాధ్యతలు అవసరం లేని విషయంగా స్పష్టపరుస్తోందా ఇల్లు. మిగిలిన పిల్లల విషయంకూడా

పట్టనట్లుండడం రమేష్‌కి కూడా అలవాటయి పోయినట్లుంది. అయినా కూతురుతో సమానంగా తల్లికంటూంది. ఆవిడకేం అనిపించదేమో"- అని విసుపోయింది రవళి.

సావిత్రికి కాస్సు చాలాకష్టమైంది. పెద్దప్రాణాన్ని దక్కించి, మృతశిశువును బయటకు తీశారు డాక్టర్లు.

రవళి ఆఫీసుకి సెలవు పెట్టి హాస్పిటల్‌లో కావల్సినవి దగ్గరుండి చూసింది.

రవళి, రమేష్ పెళ్ళి చేసుకుంటారని అతడు చెప్పకముందే ఇంట్లో అందరకీ తెలిసి పోయింది. పిల్లలంతా 'ఒదినా' అనే పిలుస్తున్నారు. ఆమె ప్రదర్శించే ఆత్మీయత, అభిమానం అందరికీ కొత్త లోకంలోకి వెళ్ళినట్లుంది. సావిత్రమ్మతోబాటు రాజ్యలక్ష్మి కూడ ఆపరేషన్ చేయించుకుంది. అబ్బాయి పుడ్తేనే ఆపరేషన్ చేయించుకుంటానన్న మూర్ఖత్వాన్ని సడలించింది.

సావిత్రమ్మలోకూడా ఇన్నాళ్ళు తప్పుచేశానన్న భావన ముల్లులా పొడుస్తుంటే ఆర్ద్రనయనాలతో రవళికి కృతజ్ఞతలు తెలుపుకుంది.

రవళి తన ఇంట్లో అడుగుపెడితే ఈ ఇంటి అస్తవ్యస్త పరిస్థితి మారిపోయి ఒకదారికొస్తుంది. అని రమేష్‌కి పూర్తిసమ్మకం కుదిరింది.

X X X

"ఏమిటో శ్రీవారు తదేకంగా ఆలోచిస్తున్నారు- ఓ! క్యాలండరు చూస్తున్నారా ?" అంది రమేష్ భుజంమీద చెయ్యివేస్తూ........

"క్యాలండర్లో పాప ముద్దుగా ఉందికదూ!" రమేష్ మాటలకు మధ్యలో అడ్డొస్తూ "స్టాప్" అంది రవళి. అర్థం కానట్టు చూశాడు రమేష్.........

పక్క టేబుల్ మీదున్న వారపత్రిక తెరచి కుటుంబనియంత్రణకు 'నిరోధ్' ఎడ్వర్టయిజ్ మెంట్ ఉంది, తీసి చూపించింది.

"ప్లీజ్ — ఒకపాప...."

"నో — ఇప్పుడేకాదు.... ఈ అడ్వర్టయిజ్ మెంట్ పూర్తిగా చదవలేదా...."

"ఓహో! ఇది కుటుంబ సంక్షేమ రవళి కాబోలు" — అంటూ ఆమెను అనురాగంగా దగ్గరకు తీసుకున్నాడు రమేష్. ఆత్మీయంగా అతన్నల్లుకుపోయింది రవళి.

(యోజన మాసపత్రిక అక్టోబర్ '83)